క్లుప్తంగా

జీలుగ విత్తనాలు సిద్ధం

తాడూరు: రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి సాయిరమేష్‌గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తా రూ.843 చెల్లించాలని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను రైతు వేదికల్లో ఏఈఓలను సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కల్వకుర్తిరూరల్: పట్టణం మొత్తం గురువారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అవగాహన సదస్సు

తాడూరు: దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగమోహన్ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

కోడేరు: మండలంలోని నాగులపల్లితండాలో శివాలయం నిర్మాణానికి చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల పేర్లు ఇవ్వండి

కందనూలు: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను విక్రయించే దుకాణాదారుల పేర్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ గోవిందరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల వారీగా 2023–24 విద్యా సంవత్సరానికి గాను 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను విక్రయించే దుకాణాదారుల పేర్లను గురువారం సాయంత్రం లోపు తప్పక సమర్పించాలని ఆదేశించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండలంలోని బాడిగదిన్నెలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పాలమూరు ప్రాజెక్టులో ముంపునకు గురైన సున్నపుతండా గ్రామ వాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి గ్రామానికి కొత్త విద్యుత్ లైన్‌కు రూ.15 లక్షలు మంజూరు చేయించినట్లు ఎంపీటీసీ సభ్యుడు శంకర్ నాయక్ బుధవారం తెలిపారు. గ్రామం ముంపునకు గురికావడం వల్ల విద్యుత్ లైన్ ప్రధాన కాల్వలో పోయిందన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



కందనూలు: జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులను బుధవారం జిల్లా కేంద్రంలోని జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఖాదర్ యాత్రికులను శాలువలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంతో పాటు నాతియా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా సుభిక్షంగా ఉండాలని, దేశంలో సుఖశాంతులతో పాటు పాడిపంటలతో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించాలని హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులను కోరారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్, షేక్ యాకూబ్ బావాజీర్, మహమ్మద్ సాధిక్ పాషా రక్షబంది, మహమ్మద్ ఇబ్రహీం నక్షబంది, మహమ్మద్ ఖజా బాబా, మహమ్మద్ నజీమ్, మోయిను పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో వ్యక్తిని చితకబాదిన సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో నల్లాలు దొంగతనం చేసేందుకు వచ్చిన వ్యక్తిని ఔట్‌పోస్ట్ సిబ్బంది చితకబాదిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఆస్పత్రిలో బాత్‌రూంలలో ఓ వ్యక్తి తరుచూ ప్లాస్టిక్ నల్లాలను తీసుకెళ్తుండగా గమనించి బుధవారం పట్టుకున్నారు. అతడిని కొట్టడం గమనించిన కొందరు వ్యక్తులు వీడియోతీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘును వివరణ కోరగా.. ఆస్పత్రిలో బాత్‌రూంలలో తరుచూ ప్లాస్టిక్ నల్లాలను తీసుకువెళుతున్న వ్యకిని పట్టుకుని మందలించారని, చితకబాదలేదని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక హోమాలు



ఉప్పునుంతల కేదారేశ్వరాలయం ఆవరణలో సామూహిక హోమాలు చేస్తున్న భక్తులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్థానిక కేదారేశ్వరాలయం ఆవరణలో భక్తులు సామూహిక హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు మహాస్నపనము చేపట్టారు. సాయంత్రం దీక్షాహోమం, జలాధివాసాంగ హోమం, ధాన్యాధివాసాంగ హోమం, విగ్రహాలకు ధాన్యది, శయ్యాది, ఫలాది, పుష్పాది వాసములు, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. గురువారం చెన్నకేశవ స్వామి, నవగ్రహాలు, వీరబ్రహ్మేంద్రస్వామి, పోచమ్మ అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠతోపాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా కొత్తరాంనగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన, ఆంజనేయ స్వామి విగ్రహం, గట్టుకాడిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉంటుందని వారు పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి ఉత్సవాలు..

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో రెండు రోజులుగా అభయాంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే బుధవారం ఉదయం 8గంటలకు ఆవాహిత దేవతాపూజలు, గణపతిపూజ, హోమం, రుద్రహోమం, గురువారం మంగళహారతి, మంత్రపుష్పం, భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, సీతారామచంద్రస్వామి కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వీర నాగమ్మ ఉత్సవాలు..

వెల్దండ: మండలంలోని కొట్రలో గురువారం నుంచి వీర నాగమ్మ దేవత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం దుడుమయ్యకు పూజలు, పుట్ట బంగారు, శుక్రవారం కల్యాణం, నైవేద్యం ఉంటుందని తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం



ఎంజీతండాలో నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: మారుమూల తండాలో నివాసం ఉంటున్న గిరిజనులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎంజీ కాలనీతండాలో రూ.1.50లక్షలతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటిశుద్ధి జలకేంద్రాన్ని ఏర్పాటు చేయగా, దాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కేవలం విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. పిల్లలను ఉన్నత చదువులను చదివించి వారి బంగారు జీవితానికి బంగారు బాటలు వేయాలన్నారు.

గ్రామాభివృద్ధికి అండగా ఉంటా..

కల్వకుర్తిరూరల్: గ్రామాభివృద్ధికి అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పంజుగుల, పంజుగుల తండాలో పర్యటించారు. ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పరశురాములు, రాజు, మాలిక్, రమేష్, రాములు పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మార్చాలకు చెందిన రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందాడు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.10 వేలను బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

వీఓఏల సమ్మె విరమణ



తెలకపల్లి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు 44 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. 45వ రోజు బుధవారం ప్రభుత్వం చర్చలు చేసి సమస్యలు పరిష్కరించడానికి సానుకూలంగా ఉన్నందున తాత్కాలికంగా సమ్మెను విరమించారు. ప్రభుత్వం స్పందించి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సీఐటీయూ నాయకులతో చర్చించారని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు పేర్కొనడంతో సమ్మెను విరమించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, గిరిజ, విజయ, ఖాజాజీ, రామకృష్ణ, పర్వత్‌బేగం, సుధా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

కొల్లాపూర్ రూరల్: మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఎన్నికలు నిర్వహించాలని మత్స్యకార సమీకృత సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సింగోటంలో లక్ష్మీదేవమ్మ గుట్టపై ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సమీకృత సంఘల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పది జిల్లాలు ఉన్నప్పుడు సంఘాల ఎన్నికలు నిర్వహించారని, ఇప్పటి వరకు అప్పటి అధ్యక్షులే కొనసాగుతున్నారన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



వివరాలు తెలుపుతున్న ఆబ్కారీ శాఖ అధికారి

అమ్రాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి గురించి వివరించారు. మండలంలో విద్యా, వైద్యం, అభివృద్ధి చెందాలని విన్నవించారు. ముఖ్యంగా దోమలపెంట, వటువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు నామమాత్రంగా ఉంటున్నాయని సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు. నీరు, విద్యుత్ సమస్యలతో పాటు మిగతా ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది, వైద్యులు లేక సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కొర్రీలు పెట్టకుండా పోడు భూములు సాగు చేసుకున్నవారందరికీ పట్టాలివ్వాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మన పరిధిలోని సమస్యలను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సభ్యులు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కారం అయ్యేవిధంగా అధికారులు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసులు. వైస్‌ఎంపీపీ ప్రణీత, ఎంపీడీఓ రామ్మోహన్, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం



మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

లింగాల: రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి కేతావత్ హతిరాంనాయక్ మృతి చెందగా, కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో హతిరాంనాయక్ సంస్మరణ సభ నిర్వహించారు. పేదరికంలో ఉంటూ ఉపాధ్యాయునిగా పని చేస్తూ అనేక సామాజిక కార్యక్రమాలలో పాలు పంచుకున్న గొప్ప వ్యక్తని, అదే విధంగా బంజార సేవా సంఘం ద్వారా బంజారాలకు సేవ చేశాడని అన్నారు. హతిరాం హెల్మెట్ లేకపోవడంతో మరణించాడని గమనించిన నిర్వాహకులు పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, ఎంపీపీ లింగమ్మ, జెడ్పీటీసీ నేజమ్మ, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, తిర్పతయ్య, మోతీరాం, బాలాజీ, శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేయాలి



బిజినేపల్లిలో వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

బిజినేపల్లి: రాష్ట్రంలో పని చేసే పంచాయతీ కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీవో రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములు, శంకర్, మైబుస్, రుక్మద్దీన్, మషన్న తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయ అధికారి వెంకటేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిబ్బందిని రెగ్యులర్‌చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస వేతనం చెల్లించాలని, జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600 వేతనం చెల్లించాలని, బిల్ కలెక్టర్లకు, కారోబార్లకు రూ.12,600, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,600 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

'ఆరోపణలు చేయడం సరికాదు'

అచ్చంపేట రూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై ఆరోపణలు చేయడం సరైంది కాదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై కరపత్రాలను బల్మూర్ మండలం జినుకుంటలో వేశారని, వారిపై బల్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే జినుకుంట సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే ఓ ఉత్సవాల్లో దళిత ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించారని ఆరోపించారు. కార్యక్రమంలో మస్తాన్, యాదయ్య, సుదర్శన్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ హనుమనాయక్



తెలకపల్లిలో మాట్లాడుతున్న జీపీఎం వెంకటేష్

కొల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్డీఓ హనుమనాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చెన్నమ్మ అధ్యక్షతన ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలను ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రోజు వారీ కార్యక్రమాలు మండలాల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ బోజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జీపీఎం ఫైనాన్స్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘంలో ఉత్సవాలు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు విజయవంతం చేయాలని మహిళలు అందరూ పాల్గొనాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలందరికీ తెలిసేలా మహిళా సంఘాల ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కోశాధికారి అమృత, నర్సింహ సుజాత, నిరంజన్, సుకునయ్య, రాములు పాల్గొన్నారు.

చారకొండ: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీఓ వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలో ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధిపై గ్రామంలో అధికారులను, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీ చేపట్టారు. సమావేశంలో ఏఓ చిన్న హుస్సేన్, పశువైద్యాధికారి మధర్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి..

కోడేరు: మండలంలో మూడు వారాల పాటు రాష్ట్ర అవతరణ ఉత్సవాలు విజయవంతం చేయాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సూచించారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

గౌరవ వేతనం పెంచడం హర్షణీయం

మన్ననూర్: ఆలయాలలో ధూప దీప నైవేద్యాలకు గాను వేద పండితులకు గౌరవ భృతి పెంచడం హర్షణీయమని వేద పండితులు నర్సింహచారి, శివప్రసాద్, శ్రీకుమార్ శర్మ, వేదాంతశర్మ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుని అదనంగా రూ.5 వేలు పెంచుతూ రూ.10 వేలు భృతి ఇవ్వడం సంతోషకరం అన్నారు. ప్రత్యేక దినాలతో పాటు నిత్యం ఆలయాల్లో పూజలు, వ్రతాలు చేసుకునే భక్తులకు ఆలయాల్లో మరింత ఆదరణ లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.

తాగునీటి కోసం మహిళల రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

బల్మూర్: మండలంలోని జినుకుంటలో వారం రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని మహిళలు బుధవారం నాగర్‌కర్నూల్– అచ్చంపేట ప్రధాన రహదారి జినుకుంట గేటు వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడటంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా స్పందించలేదని ఆరోపించారు. సమస్య పరిష్కరించే వరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించుకుని కూర్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బోరు మోటారును ఏఈ రిపేర్ చేయించి తాగునీటి సరఫరా చేశారు.

బీఎల్‌ఓలకు బకాయిలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న బీఎల్‌ఓలు

తెలకపల్లి: బీఎల్‌ఓలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని సీఐటియు నాయకురాలు చంద్రకళ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఎల్‌ఓలు ధర్నా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఓలకు 4ఏళ్లుగా ఎలాంటి వేతనం ఇవ్వలేదని, స్పెషల్ డ్రైవ్ పేరిట పనులు చేయిస్తున్నారని అన్నారు. ఒక్కొక్కరికి రూ.20 వేల బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఎల్‌ఓ మీటింగ్‌లకు వచ్చిన ప్రతి సారి డీఏ, టీఏలు ఇవ్వాలని ఎప్పటికప్పుడు నెలవారి జీతాలు ఖాతాలలో వేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపస్ లక్ష్మణ్, బీఎల్‌ఓలు ప్రభావతి, అరుణ, రాధా, అక్బరీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఎన్ని ఇళ్లు ఇచ్చారు?



మాట్లాడుతున్న కొత్తపల్లి కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్: అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 9ఏళ్లలో గిరిజనులకు ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారో చెప్పాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ ప్రశ్నించారు. స్థానిక సింగిల్‌విండో సమావేశ మందిరంలో బుధవారం గిరిజన అలాయ్ బలాయ్ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయనతో పాటు రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహాన్‌నాయక్ మాట్లాడుతూ పోడు రైతులకు సంకెళ్లు వేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని నిలదీశారు. ఎన్నికల కోసం పోడు రైతులకు పట్టాలిస్తామని మరో మోసానికి తెరలేపారన్నారు. సీఎం కేసీఆర్‌కు ఎస్టీలపై ప్రేమ ఉంటే ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎందుకు ఖాళీగా ఉంటుందని ప్రశ్నించారు. తండాలను పంచాయతీలుగా చేసినా వాటివల్ల ఎలాంటి ఉపయోగం లేదని, వాటిని రెవెన్యూ పంచాయతీలుగా చేసినప్పుడు మాత్రమే గిరిజనులకు పూర్తి న్యాయం లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనులంతా బీఎస్పీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాత్రమే గిరిజనులకు పూర్తి స్థాయి న్యాయం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో దేవరకొండ అసెంబ్లీ అధ్యక్షుడు రామావత్ రమేష్ నాయక్, రాష్ట్ర కోఆర్డినేటర్ బాబునాయక్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కోనేటి సుజాత, పీయూ నాయకులు రూప్‌సింగ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శులు విజయ్, రామకృష్ణ, యోసోఫ్, బ్రహ్మయ్య, రాములక్క, బోనాసి రాంచందర్, పృథ్వీరాజ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకు చొరవ చూపాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం కలెక్టర్ చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో 35ఏళ్ల నుంచి తక్కువ వేతనంతో పనిచేస్తున్నా వేతనాల పెంపు విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనాల జీఓ వచ్చినప్పటికీ 330 పడకల జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి జీఓ నంబర్ 60ని అమలు చేసి అదనపు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టులో జీవో అమలు చేసి వేతనాలు పెంచామని చెబితే ఇద్దరు కాంట్రాక్టర్ల గొడవల మధ్య 10 నెలల వేతనం రూ.16,500 కోల్పోయారని చెప్పారు. కేవలం 32 మంది సిబ్బందితో 330 పడకల ఆస్పత్రిని కొనసాగిస్తున్నారని ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని టెండర్ ప్రక్రియ ముగిసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రామయ్య, బాలకృష్ణ, రాధ, అలివేల, నిరంజన్, వెంకటేష్, గిరి, శేఖర్ పాల్గొన్నారు.

శ్వాస ఉన్నన్ని రోజులు సేవ చేస్తా..

అచ్చంపేట రూరల్: శ్వాస ఉన్నన్ని రోజులు రైతులకు సేవ చేస్తానని, కృష్ణా నీటితో నల్లమల ప్రాంత రైతుల కాళ్లను కడుగుతానని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం పట్టణంలోని నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు బహిరంగ సభను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తూ వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేశారన్నారు. రైతుల కష్టాలను కడతేర్చడానికి సీఎం కేసీఆర్ ఉన్నారన్నారు. త్వరలో ప్రారంభం కానున్న గృహలక్ష్మి పథకంలో భాగంగా నియోజకవర్గానికి 5వేల ఇళ్లు మంజూరు చేయించుకుని పేదలకు అందిస్తామన్నారు. ప్రతిపక్ష నాయకులు అపశకునం మాటలు మాట్లాడకుండా అభివృద్ధికి సహకరించాలన్నారు. నియోజకవర్గానికి మంజూరైన ప్రాజెక్టును నిర్మించి తీరుతామన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, రాంబాబునాయక్, విష్ణుమూర్తి, లోక్యనాయక్, రమేష్‌రావు, ఖలీల్, శంకర్‌మాదిగ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందచేస్తున్న మిత్రులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ చెందిన కృష్ణయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు అకాల మరణం చెందడంతో దోస్త్ 86 ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.1,05,000 ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్ రమేష్ మాట్లాడుతూ పదో తరగతిలో తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. సభ్యులు జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజిసింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు మాధవరెడ్డి, కౌన్సిలర్ బోజిరెడ్డి, వేణుగోపాల్, న్యాయవాది వెంకటరమణ, మహమూద్, వెంకటయ్య గౌడ్ సహకారంతో నగదు సమకూర్చి కృష్ణయ్య భార్యకు అందజేశామన్నారు.

పొగాకుతో దుష్ప్రభావాలు అధికం



మాట్లాడుతున్న డాక్టర్ అఖిల్

మన్ననూర్: పొగాకు సేవిస్తే అధిక దుష్ప్రభావాలు వస్తాయని పల్లె దవాఖాన డాక్టర్ అఖిల్ గ్రామస్తులకు సూచించారు. బుధవారం మాచారంలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సబ్‌సెంటర్‌లో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొగాకు తాగడం వలన ఊపిరితిత్తులు చెడిపోయి క్యాన్సర్ తదితర వ్యాధులు సంక్రమించి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. పొగాకు తాగుతున్న వారి సమీపంగా ఉండి ఆ పొగ పీల్చిన వారు కూడా అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. అంతకు ముందు గ్రామంలో పొగాకు నిషేధంపై గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పెద్దిరాజు, ఉప సర్పంచ్ ఆనంద్, ఏఎన్ఎం నీల, గ్రామస్తులు పాల్గొన్నారు.